క్లుప్తంగా

పంటకోత ప్రయోగం

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలో హైదరబాద్‌కు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌కు చెందిన అధికారులు రైతు రావులపల్లి పృథ్వీ పొలంలో పంటకోత ప్రయోగం ఆదివారం నిర్వహించారు. పొలంలో 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో మొదటి ప్రయోగంలో 7.285 కిలోల, రెండో ప్రయోగంలో 14.735 కిలోలు దిగుబడి వచ్చిందని సీపీఓ యు.శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం ఆయన సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఆటోమేటిక్ వేదర్ స్టేషన్ పనితీరును పరిశీలించారు. కార్యక్రమములో డైరెక్టరేట్ నుంచి పరిశీలనకు వచ్చిన అధికారులు యం.రాంబద్రం, కన్సల్టెంట్ టీఎస్‌డీపీఎస్ కె.వెంకట్రావు, ఉపగణాంక అధికారి కె.తిరుపతి రావు, ఉపగణాంక అధికారి,సబ్ కలెక్టర్ ఆఫీస్ బి.ప్రదీప్, ఎంపీఎస్వోడి రూప్‌సింగ్, రైతులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు వితరణ

అశ్వారావుపేటరూరల్: అనాథ వృద్ధులకు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తన కుమారుడు తాటి రవికుమార్‌తో కలిసి వితరణ అందించారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే కుమార్తె డాక్టర్ తాటి మహాలక్ష్మీ ద్వితీయ వర్ధంతి సందర్భంగా అశ్వారావుపేటలోని అమ్మ సేవా సదనం లోగల వృద్ధులకు అన్నదానం చేసి, వారందరికీ నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం సేవా సదనం నిర్వహణ కోసం, సేవా సదనాన్ని నిర్వహిసిస్తున్న కూరపాటి అనసూయకు రూ.10వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సత్యవరపు సంపూర్ణ, యూఎస్ ప్రకాశ్‌రావు, మాజీ జడ్పీటీసీ అంకత మల్లికార్జున్‌రావు, మాజీ సర్పంచ్ పొట్టా రాజులు, మోటూరి మోహన్, సోయం చిన్నారి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దులు మృతి

కరకగూడెం: పిడుగుపాటుకు రెండు ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. రేగుళ్ల గ్రామానికి చెందిన గోగు రాంబాబు రైతు ఎప్పటిలాగే తన రెండు ఎడ్లను చెట్టు కింద కట్టేసి ఉంచారు. ఆదివారం సాయంత్రం ఉరుములతో కురిసిన వర్షానికి పిడుగు ఎడ్లపై పడడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.1 లక్ష వరకు ఉంటుందని బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. కాగా వ్యవసాయంలో తనతో చేదోడు వాదోడుగా ఉండే ఎద్లు మృత్యువాత పడ్డాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నారు.

పాడిగేదె..

కరకగూడెం: పినపాక మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడి మండల పరిధిలోని పొట్లపల్లి గ్రామ పంచాయతీ ఉలవచలక గ్రామానికి చెందిన రైతు పూనేం బాలకృష్ణకు చెందిన పాడి గేదె మృతి చెందింది. రోజు వారిగా మేతకు వెళ్లిన సమయంలో పిడుగుపాటుకు గురై మృత్యువాత పడింది.గేదె మృతితో రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాని కోరారు.

ద్విచక్ర వాహనం పల్టీ.. యువకుడికి గాయాలు



క్షతగాత్రుడిని 108 వాహనం ఎక్కిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, తదితరులు

గుండాల: ద్విచక్ర వాహనం పల్టీ కొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది.పినపాక మండలం గడ్డంపల్లి గ్రామానికి చెందిన యశ్వంత్ కుమార్ గుండాల మండలంలోని ముత్తాపురం గ్రామంలో జరిగిన వివాహానికి హాజరై తిరుగు ముఖంలో నాగరం స్టేజీ వద్ద అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ క్రమంలో గుండాల మండలంలో ఓ శుభకార్యానికి హాజరైన పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అటుగా వెళుతుండగా క్షతగాత్రుని గమనించారు. వెంటనే 108 ద్వారా కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. యువకునికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య అధికారులకు సూచించారు.

హిజ్రాల ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని చిన్నబండిరేవు గ్రామానికి చెందిన ఓ నిరుపేద యువతికి హిజ్రాలు రూ.3వేలు, నగదు, చీరను ఆదివారం అందజేశారు. వివాహం నిశ్చయమైన ఆమెకు.. తండ్రి కూడా లేకపోవడంతో హిజ్రాలు ఆర్థిక సహకరారాన్ని అందించారు. ఆర్థికసాయం చేసిన వారిలో హిజ్రాలు అమూల్య, ప్రవీణ, రుచిత, పావని, శృతిలు ఉన్నారు.

హోంగార్డుకు సన్మానం

భద్రాచలం: భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి వారి ఆలయం వద్ద చాలాకాలంగా హోంగార్డుగా విధులు నిర్వహించి ఆదివారం రిటైర్డ్ అయిన హోంగార్డు వెంకటేశ్వర్లను ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎల్.రమాదేవి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిండింటెంట్ సాయిబాబు,ఆలయ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్ష బీభత్సం



కరకగూడెం: తోగ్గూడెంలో కూలిన పూరిల్లు



ములకలపల్లి: మాదారం అడవిలో విరిగిపడిన చెట్లు



అశ్వారావుపేటరూరల్: ఆసుపాకలో రహదారిపై పడిన వృక్షాలను తొలగిస్తున్న గ్రామస్తులు



మణుగూరుటౌన్: మణుగూరు పట్టణంలో వర్షానికి తడిసిన రహదారి



దుమ్ముగూడెం: పెద్దనల్లబల్లిలో ధాన్యం తడవకుండా బరకాలు కప్పిన రైతులు

- ఉరుములు మెరుపులతో గాలివాన
- తడిసిన ధాన్యం.. విరిగిన చెట్లు
- ఎగిరిపడిన ఇళ్ల రేకులు.. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- ఎండ తాపం నుంచి ప్రజలకు ఉపశమనం



అన్నపురెడ్డిపల్లి: ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు

కరకగూడెం: ఉమ్మడి మండలాలైన పినపాక, కరకగూడెంలలో ఆదివారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. దీంతో జన జీవనం అతలాకుతలమైంది. పలు చోట్ల ఈదురు గాలులు వీచి ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. ముఖ్యంగా కరకగూడెం మండలంలోని కన్నాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని అంగారుగూడెం వలస ఆదివాసీ గ్రామంలో సుమారు 20 రేకుల ఇళ్లులు గాలివానకు లేచిపోయాయి. పలు చోట్ల ప్రధాన రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే దిగుబడులు లేక పంట ఉత్పత్తులకు అపార నష్టం వాటిల్లగా, ఉన్న కొద్దోగొప్పో ధాన్యాన్ని అమ్ముకుంటే పెట్టుబడి పైసలయినా వస్తాయనుకున్న రైతులకు కన్నీళ్లే మిగిలాయి. అకాలంగా కురిసిన వానతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం పలు చోట్ల తడవగా మరికొన్ని చోట్ల రైతులు తడవకుండా టార్పాలిన్లు కప్పుకున్నారు. అలాగే బయ్యారం క్రాస్ రోడ్‌లో రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచింది.అంతేకాకుండా క్రాస్ రోడ్లో గాలి వానకు రెండు హోటల్లు ధ్వంసమయ్యాయి. తోగ్గుడెం గ్రామంలోబూరిక చరణ్ గుడిసే వర్షానికి నెలకూలింది. తద్వారా అంతటా తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను,సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

అశ్వారావుపేటరూరల్: అకాల గాలివానతో పలు గిరిజన గ్రామాలు అతలాకుతలం అయ్యాయి. పలు చోట్ల ఇళ్ల పైకప్పులు వేగంగా వచ్చిన ఈదురు గాలులతో ధ్వంసం కాగా, పెద్ద పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. నందిపాడు గ్రామానికి చెందిన ఎనుముల నీలాద్రి చెందిన ఇంటిపైకప్పు రేకులు దాదాపు 50 మీటర్ల దూరంలో ఎగిరిపడి ధ్వంసం కాగా, బాధితుడి భార్య, ముగ్గురు పిల్లలు ఆ సమయంలో ఇంట్లోనే ఉన్నారు. ఇంటి కప్పు రేకులు ధ్వంసమైన ఏలాంటి ప్రమాదం జరగకపోవడంతో వారంతా సురక్షితంగా బయట పడ్డారు. మండలంలోని కోయ రంగాపురం గ్రామానికి చెందిన మడివి వెంకటేష్ పూరిల్లు కూలిపోగా, కుడుములపాడు, గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల్లో ఇళ్ల పైకప్పు రేకులు విరిగి పడ్డాయి. అదే విధంగా వడ్డెర రంగాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన సుమారు 400 ధాన్యం బస్తాలు వర్షం తడిపోగా, బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ఆసుపాక-నందిపాడు మార్గంలో పలు చోట్ల పెద్ద పెద్ద వృక్షాలు భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి, కొత్తూరు నుంచి ఏపీలోని మేడేపల్లికు వెళ్లే ప్రధాన రహదారుల్లో అడ్డంగా విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్లపై అడ్డంగా పడిపోయిన వృక్షాలను స్థానికులు, యువకులు స్పందించి వాటిని తొలిగించారు. దాంతో వాహనాల రాకపోకలు సాగాయి. ఆయా గ్రామాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలు కుడా విరిగిపడ్డాయి. దాంతో గిరిజన గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా, విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరించే పనుల్లో నిమగ్నం అయ్యారు. కాగా అకాల దుమారంతో మామిడి, ధాన్యం రైతుల్లో ఆందోళన నెలకొంది. గాలి దుమారంతో మామిడి తోటల్లోని కాయలు పలు చోట్ల రాలిపోగా, రైతులకు నష్టం వాటిల్లింది.

అశ్వాపురం: మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పొలాలు పొట్ట దశకు చేరి కోత దశలో ఉండటంతో ఈ సమయంలో వర్షంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వరి పొలాలు కోసి కల్లాల్లో, ఖాళీ స్థలాల్లో ధాన్యం ఆరబోయడంతో వర్షంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

అన్నపురెడ్డిపల్లి: మండలంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు జల్లులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉండగా, సాయంత్ర సమయానికి ఒక్కసారిగా వర్షపు జల్లు పడింది. అకాలంగా కురిసిన వర్షపు జల్లులతో అన్నదాతలు ఆరబోసిన ధాన్యంపై టార్పాలిన్‌లు కప్పారు. అన్నపురెడ్డిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం పై కప్పిన పరదాల పై వర్షపు నీరు నిలిచింది. అకాల వర్షంతో అన్నదాతలు ధాన్యాన్ని కాపాడుకునేందుకు అవస్థలు పడ్డారు. గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఎండ నుంచి ఉపశమనం పొందారు.

మణుగూరుటౌన్: మండలం, మున్సిపాలిటీలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రెండు గంటలకు పైగా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లు వర్షం కురిసింది. సింగరేణి ఓపెన్‌కాస్ట్ ఏరియా కావడంతో మార్చి నుంచే వడగాలులతో కూడి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు.. ఆదివారం సాయంత్రం వాతావరణం చల్లబడి చిరుజల్లులతో కూడిన వర్షం కురియడంతో ఊపిరిపీల్చుకున్నారు. బయట తిరుగుతూ సేదతీరారు.

ములకలపల్లి: ములకలపల్లి మండల వ్యాప్తంగా ఆదివారం చిరుజల్లులు కురిశాయి. అకాల వర్షాలకు కల్లాల్లోని ధాన్యం తడిచి పోయింది. ఉదయం ఎండ వేడిమికి ప్రజలు అల్లాడి పోగా, ఉరుములు, మెరుపుల వానకు వాతావరణం చల్లబడింది. ఎర్రప్పగుంపులో విద్యుత్ స్తంభాలు విరగడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఈదురు గాలులకు మాదారం అటవీ ప్రాంతంలో చెట్లు విరిగి పడ్డాయి.

చండ్రుగొండ: మండలంలో ఆదివారం సాయంత్రం నుండి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు పడ్డాయి. దీంతో వాతావరణం కొంత చల్లపడింది. ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే ఇటీవలకాలంలో విపరీతమైన ఎండవేడిమితో ప్రజలు ఇబ్బందులు పడ్తున్నారు. ఆదివారం రోజు మొత్తం ఎండవేడిమి ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం పడిన చిరుజల్లులతో ఉపశమనం లభించింది.

దుమ్ముగూడెం: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఉరుమెరుపులతో కూడిన వర్షం కురిసింది.గత కొన్ని రోజులుగా ఎండలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కురిసిన వర్షానికి కొంచెం వాతవరణం చల్లబడటంతో ఊపిరిపీల్చుకున్నారు.రైతులు కోసిన వరి ధాన్యం కల్లల్లో ఉండటంతో దాన్యం కాపాడుకునేందుకు రైతులు వాటిపై బరకాలను కప్పి రక్షణ చర్యలు చేపట్టారు.



కరకగూడెం: అంగారుగూడెంలో గాలివానకు నేలకూలిన ఇల్లు



అశ్వారావుపేటరూరల్: గాలి బీభత్సంతో రేకులు ఎగిరిపోయి, ముందు భాగం కూలిన ఇల్లు



కరకగూడెం: తాటిగూడెంలో కూలిన రేకుల షెడ్డు



చర్ల: కల్లంలో ఆరబోసిన మిర్చిపై టార్పాలిన్లు కప్పుతూ..



అన్నపురెడ్డిపల్లి: ధాన్యంపై కప్పిన టార్పాలిన్

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం చర్లలో జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్ జిల్లాల్లోని అటవీ ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలిరానుండా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు రోడ్, కలివేరు క్రాస్‌రోడ్, ఆర్ కొత్తగూడెం తదితర ప్రాంతాలలో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్‌పార్టీ, సివిల్ పోలీసులు ఈ తనిఖీలను కొనసాగించారు. సీఐ ఏ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీలను కొనసాగించారు. ఈ సందర్భంగా అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి విడిచిపెట్టారు.

ఎన్నికల అధికారుల తనిఖీలు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బు, మద్యం, గృహోపకరణాలు తరలించే అవకాశాలు ఉండడంతో ఎన్నికల అధికారులు చర్ల మండలంలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. మండలంలోని ఆర్ కొత్తగూడెం, కలివేరు, రైస్‌పేట, కొయ్యూరు తదితర ప్రాంతాలలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వచ్చి పోయే వాహనాలను ఆపి నిశితంగా తనిఖీ చేశారు. వాహనాలో తరలిస్తున్న లగేజీలపై ఆరా తీశారు. తనిఖీలలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో పాటు సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.



ఆర్ కొత్తగూడెంలో తనిఖీలు చేస్తున్న ఎన్నికల అధికారులు

‘మిషన్ భగీరథలో అవినీతి’

దుమ్ముగూడెం: మండలంలో మిషన్ భగీరథ పథకంలో భారీ అవినీతి చోటుచేసుకుందని, మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ విమర్శించారు. ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ తాగునీటి సమస్య మండలంలో తీవ్రంగా ఉందన్నారు.

అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై భారీగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మండలం మొత్తం మీద ఇంట్రా పైప్ లైన్ ఒరిజినల్ ఎడిషన్ వర్కింగ్ పేరుతో 300 కిలోమీటర్లు మంజూరు కాగా 100 కిలోమీటర్లు కూడా వేయకుండా పీవీసీ పైప్స్ అమ్ముకొని 200 కిలోమీటర్లు వేసినట్లు చూపించారని ఆరోపించారు. అలాగే గ్రామపంచాయతీ నుంచి 30 లక్షలు మండల పరిషత్ నుంచి 15 లక్షలు పెడస్టల్స్ పోయకుండానే పోసినట్లు చూపించి సుమారుగా 20 లక్షల రూపాయలు బిల్లులు చేసుకున్నారని, పాత గ్రామపంచాయతీ కనెక్షన్లనే లైన్లనే మిషన్ భగీరథ కనెక్షన్లు అని చూపించి కోట్లాది రూపాయల దోసుకున్నారని తెలిపారు. ఇటువంటి అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్లు, అధికారుల నుంచి సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూజారి సూర్యచంద్రరావు, డింగి సందీప్ రెడ్డి, సిద్ది ప్రవీణ్, శ్రీధర్ గద్ద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కప్పేసిన పాపమెవరిది..?

అశ్వారావుపేట: మండల పరిధిలోని వినాయకపురం శివారు వైకుంఠధామం వద్ద బ్రిడ్జిపై ఓ గేదె మృతకళేబరం పడిఉంది. ఈ కళేబరాన్ని మట్టితో కప్పేశారు. ఈగేదెను గుద్ది చంపిన పాపమెవరిది..? ఈపాపాన్ని కప్పేసిన పాపమెవరిదో అర్థం కాకుండా ఉంది. గుర్తు తెలియని వాహనాలు ఢీకొని చాలా పాడిగేదెలు మృతిచెందుతూనే ఉన్నాయి. ఇలాంటి మృతదేహాలను గ్రామపంచాయతీ లేదా ఆర్‌అండ్‌బీ సిబ్బంది తొలగించాలి. కానీ అలా తొలగించకుండా మట్టితో అదీ బ్రిడ్జిపైన కప్పేయడంతో దుర్వాసన ప్రబలి ప్రజా జీవనానికి ఇక్కట్లు కలిగించే ప్రమాదముంది. ఏది మానవత్వం..? ఏది పశుతత్వం..?



మట్టితో కప్పేసిన పశు మృత కళేబరం

నల్లబ్యాడ్జీలతో నిరసన

మణుగూరుటౌన్: పీకేఓసీ-2లో విధులు నిర్వహిస్తున్న ఓవర్‌మెన్‌ను క్వారీ నుంచి బయటకు పంపడాన్ని నిరసిస్తూ కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జ్ సురేందర్‌కుమార్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీరాం శంకర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుక్షణం ఉత్పత్తి ఉత్పాదకతల్లో కీలక పాత్ర పోషించే మైనింగ్ స్టాఫ్‌ని విధుల నుంచి బయటకు పంపించడం సరైందికాదన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దార సుకుమార్, గుర్రం సుదీప్, కోడి శ్రీనివాస్, రమేశ్, సతీష్, రాజకుమార్, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, కార్తీక్, ప్రసాద్, అశోక్, సంతోష్, నవీన్, రాజకిరణ్, కిరణ్ తదితరులు ఉన్నారు.

24న విగ్రహ ప్రతిష్ఠ

చర్లరూరల్: మండలంలోని జీపీపల్లి గ్రామంలో ఈ నెల 24వ తేదీ బుధవారం పంచముఖి ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం, మంగళవారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్ష ధారణ, యాగశాల సంస్కారంతో పాటు విశిష్ట పూజల అనంతరం బుధవారం ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో పంచముఖి ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

రేపు శోభాయాత్ర..

చర్ల మండల సనాతన దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో 23వ తేదీ మంగళవారం మండలంలోని తేగడ గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయం నుంచి పాతచర్ల లోని శివాలయం వరకు అన్ని దేవాలయాల ఉత్సవ మూర్తులతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శివ్వారపు వీర భోగాచారి తెలిపారు.

నేడు సన్నాహక సమావేశం

దమ్మపేట: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్నట్లుగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డా రాజేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం, దమ్మపేట గ్రామ శివారులోని మల్లారంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ఈ సమావేశం ఉంటుందని, బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి నామా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు కోనేరు చిన్ని, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలియజేశారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సభ ఏర్పాట్ల పరిశీలన



దుమ్ముగూడెం: ఏర్పాట్లు పరిశీలిస్తున్న పొదెం వీరయ్య, నాయకులు

దుమ్ముగూడెం: మండలంలోని గంగోలు వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కోసం జరిగే సమావేశ ఏర్పాట్లను భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య ఆదివారం పరిశీలించారు.ఈ నెల 23వ తేదీన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు హాజరు కానున్నారు. ఈ సమావేశానికి భారీగా నాయకులు,కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చింతిరాల రవి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరమాచినేని వినిల్, నాయకులు సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

వీరయ్యను కలిసిన యువజన నాయకుడు..

భద్రాచలం: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు పొదెం వీరయ్యను మర్యాదపూర్వకంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు పోరిక సాయిశంకర్ ఆదివారం కలిశాడు. భద్రాచలంలోని పొదెం వీరయ్య క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భద్రాచలం, పినపాక, ఇలెందు నియోజకవర్గాల్లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ క్యాంపెయినింగ్‌లు, ఇతరత్రా వ్యవహారాలపై సుదీర్ఘంగా చర్చించారు.

అ‘పూర్వ’ కలయిక!

కరకగూడెం: పినపాక మండలంలోని ఏడూళ్ళ బయ్యారం క్రాస్ రోడ్డులోని జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో 29 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన వేడుకలో మండల పరిధిలోని ఏడూళ్లబయ్యారం జెడ్పీ ఉన్నత పాఠశాల,వికాస్ విద్యానికేతన్లో 1994-95వ సంవత్సరంలో పదవతరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. విద్యాబుద్ధలు నేర్పిన గురువులను ఆహ్వానించిన వారు ప్రత్యేకంగా సన్మానించారు. అమెరికాలో స్థిరపడిన పలువురు సైతం స్నేహితులను కలుసుకునేందుకు హాజరు కావడం విశేషం. వీరంతా 29 ఏళ్ల తర్వాత ఆదివారం ఒక్కచోటుకు చేరారు. చిన్నపిల్లల్లా మారి సందడి చేశారు. ఆడిపాడి గంతులేశారు. చిన్ననాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. కార్యక్రమ అనంతరం సహపంక్తి భోజనం చేసిన వారు చిన్ననాటి జ్ఞాపకాలనను నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, హను, వెంకటరెడ్డి, తిరుపతిరెడ్డి, జగదీశ్వరరెడ్డి, రాధ విద్యార్థులు ప్రవాస భారతీయులు చెన్నారెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, విశ్వభరత్రెడ్డి, గడ్డం సతీశుము జాల వెంకట్రామయ్య, శివప్రసాదు, విజయ్ పాల్గొన్నారు.



కరకగూడెం: 29 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాగునీటికి ఇక్కట్లు



బిందెడు తాగునీటి కోసం తిప్పలు పడుతున్న మహిళలు

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ ప్రాంత వాసులు గత కొంతకాలంగా మంచినీటి కోసం పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. రెండు, మూడు రోజులకు ఒకసారి వచ్చే మంచినీటి కోసం మహిళలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఆదివారం మంచినీటి కోసం భగత్‌సింగ్ నగర్ వాసులు బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మంచినీటిని ఎప్పుడు సరఫరా చేస్తారో.. ఎప్పుడు బంద్ చేస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. మంచినీరు సక్రమంగా రావడం లేదని సంబంధిత మున్సిపల్ అధికారులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ఉన్నతాధికారులు ఆయా శాఖలకు ఆదేశాలు ఇచ్చినా.. మున్సిపల్ అధికారులు ఇవేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, కనీసం ప్రత్యామ్నాయ చర్యలు కూడా చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి కోసం పిల్లలు, పెద్దలు విలవిలలాడిపోతున్నారన్నారు. ఇప్పటికై నా మున్సిపల్ అధికారులు స్పందించి మంచినీటిసమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.